సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



ఇళ్ల కూల్చివేత

ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించారనే ఫిర్యాదుతో బడంగ్‌పేట 10వ డివిజన్ కుర్మల్‌గూడలో ఇళ్లను నేలమట్టం చేశారు. 12లో▸



చైర్మన్‌గా ఆయన అనర్హుడు

మంచాల పీఏసీఎస్ చైర్మన్‌ని అనర్హుడిగా ప్రకటిస్తూ పీఏసీఎస్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్టర్ విజయ నోటీసులిచ్చారు. 12లో▸



ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 12లో▸

న్యూస్‌రీల్

మాచన రఘునందన్‌కు అరుదైన అవకాశం



ప్రచారం నిర్వహిస్తున్న రఘునందన్

తుర్కయంజాల్: పొగాకు నియంత్రణ కోసం ఉద్యమ స్ఫూర్తి కలిగి ఉన్న వ్యక్తి మాచన రఘునందన్ అని అంతర్జాతీయ పొగాకు నియంత్రణ వేదిక సైఫర్ గ్లోబల్ ఉద్ఘాటించింది. గురువారం నిర్వహించిన గ్లోబల్ టొబాకో కంట్రోల్ వెబినార్‌లో భారత దేశం నుంచి ఇద్దరు పాల్గొనగా, దక్షిణ భారతదేశం నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్‌కు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ఫిబ్రవరిని చెక్ యువర్ హెల్త్ మాసంగా పరిగణిస్తారన్నారు. ఈ కోవలోనే ప్రపంచ వ్యాప్తంగా పొగాకు నియంత్రణ ఆవశ్యకతపై పలు దేశాల వక్తలు ఈ వెబినార్‌లో పాల్గొన్నట్టు చెప్పారు. రెండు దశాబ్దాలుగా పొగాకు నియంత్రణ కోసం చేస్తున్న పోరాటాన్ని గుర్తించి తనకు ఈ అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులతో పాటు, అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రశంసలు, ఇంగ్లాండ్, జర్మనీ, ఆఫ్రికా, అమెరికా తదితర దేశాల నుంచి సైతం పొగాకు నియంత్రణ సదస్సుల్లో పాల్గొనే అవకాశం దక్కిందన్నారు. ధూమ పానం చేసే వారిని ఆలోచింపజేసేలా చేయడంతో పాటు,దురాలవాట్లు మానేలా కృషి చేస్తున్నందుకు సైఫర్ గ్లోబల్ అభినందించడం గర్వంగా ఉందన్నారు. ఈ నెల 21న నో స్మోకింగ్ డే సందర్భంగా జాతీయ స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని రఘునందన్ తెలిపారు.

బైక్ రైడర్ విఘ్నేశ్‌గౌడ్‌కు మంత్రి పొన్నం సత్కారం



మద్దుల: నేషనల్‌బైక్ రైడింగ్ చాంపియన్‌షిప్ సాధించిన బైక్ రైడర్ పాలకుర్ల విఘ్నేశ్‌గౌడ్‌ను బీసీశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా సత్కరించారు. మండలంలోని ఇర్విన్‌కు చెందిన పాలకుర్ల యాదయ్యగౌడ్ కుమారుడు విఘ్నేశ్‌గౌడ్ బైక్ రైడర్‌గా అనేక పోటీల్లో పాల్గొని విజయం సాధించాడు. ఇప్పటివరకు ఆరు జాతీయ చాంపియన్‌షిప్ అవార్డులు గెలుచుకున్నాడు. గత ఏడాది చెన్నైలో నిర్వహించిన జాతీయ బైక్ రైడింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని చాంపియన్‌షిప్ సాధించాడు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం విఘ్నేశ్‌గౌడ్‌ను సత్కరించి అభినందించారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



కబడ్డీలో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్‌మీట్

ప్రారంభించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

- వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్న పోలీసు సిబ్బంది

హుడాకాంప్లెక్స్: క్రీడలు మానసిక, శారీరక వికాసానికి తోడ్పడతాయని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో గురువారం 5వ రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్–2024ను గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు మన జీవితంలో ముఖ్య భాగమని, వివిధ రకాల మానసిక, శారీరక ఒత్తిళ్లను అధిగమించడానికి ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చిన్న వయసు నుంచే క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిళ్లను, వివిధ రకాల సవాళ్ల నుంచి ఉపశమనం పొందేలా నూతనోత్తేజంతో పనిచేసేలా స్పోర్ట్స్ మీట్ దోహదపడుతుందన్నారు. ఈ క్రీడా పోటీల ద్వారా వివిధ రకాల పోలీసు విభాగాల మధ్య సహృద్భావ వాతావరణం, వృత్తిలో సమష్టితత్వం ఏర్పడుతుందని చెప్పారు. అన్ని జట్లు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాచకొండ పరిధిలోని మల్కాజిగిరి, ఎల్‌బీనగర్, యాదాద్రి, మహేశ్వరం జోన్ల డీసీపీల పరిధిలోని 60 పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న అన్ని పోలీసు విభాగాల సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర, ఎస్‌ఓటీ డీసీపీ–1 గిరిధర్‌రావు, ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి, ఎస్‌ఓటీ డీసీపీ–2 మురళీధర్, ట్రాఫిక్ డీసీపీలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన

షాద్‌నగర్: ఐకమత్యంతోనే హక్కుల సాధన సులభం అవుతుందని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో గురువారం బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాములుగౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రకారం రావాల్సిన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా అనుకున్న స్థాయిలో అభివృద్ధి సాధించలేదని అన్నారు. ఏ ప్రభుత్వాలు కూడా ఇప్పటి వరకు బీసీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయలేదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి, విద్యారంగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం బీసీ గణనను వెంటనే పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో యాభైశాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయపార్టీలు బీసీలకు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలంతా సమస్యల సాధన కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, కృష్ణ యాదవ్, కరాటే చెన్నయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణ యాదవ్

ఏనాడూ పదవులు ఆశించలేదు

- గవర్నర్ పదవి బాధ్యతాయుతమైనది
- పనిచేసేవారికి బీజేపీలో గుర్తింపు ఉంటుంది
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

ఇబ్రహీంపట్నం: గవర్నర్ పదవి చాలా బాధ్యతతో కూడుకున్నదని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి అన్నారు.ఆ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి ఇబ్రహీంపట్నంలో గురువారం ఆత్మీయ సన్మా నం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేరుకే గవర్నర్ పదవికాదని.. చాలా బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపట్టే పనులను పరిశీలిస్తూ.. ప్రజలకు చెరుతున్నాయా లేదా గమనించాల్సిన బాధ్యత ఉందన్నారు. బాల్య వివాహాలను అరికట్టడం, చిల్డ్రన్స్, ఎయిడ్స్, యూనివర్సిటీల బాధ్యత తదితర ముఖ్యమైన విధులుంటాయన్నారు. సామాన్య కార్యకర్తగా ఒకనాడు పనిచేసి నేడు ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశం బీజేపీ కల్పించిందన్నారు. తాను ఏనాడు పదవులను ఆశించలేదని పేర్కొన్నారు. బీజేపీలో ప్రతి సామాన్య కార్యకర్తకు ఏదోఒకరోజు ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశం దక్కు తుందన్నారు. పార్టీ కోసం పనిచేసేవారిని అధిష్టానం తప్పక గుర్తిస్తుందన్నారు. దేశంలోనే అత్యున్నత రాష్ట్రపతి పదవిని ద్రౌపది ముర్ము, రామనాథ్‌కోవింద్‌లకు దక్కిన విషయాన్ని గుర్తు చేశారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలతో, పార్టీ శ్రేణులతో మరిచిపోలేని అనుభూతులున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పార్టీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, పొరెడ్డి నర్సింహారెడ్డి, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, పొరెడ్డి అర్జున్‌రెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, రావినూతల శశిధర్, గోగిరెడ్డి లచ్చిరెడ్డి, వెంకట్ రెడ్డి, బాల్‌రెడ్డి, ఎంపీపీ సుకన్యబాష తదితరులు పాల్గొన్నారు.

పురుషులకు మాత్రమే..

ఇబ్రహీంపట్నం డిపోలో ప్రత్యేక బస్సు

- సోషల్ మీడియాలో వైరల్
- ఉన్నతాధికారుల నుంచి చివాట్లు?
- నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న డిపో



పురుషులకు మాత్రమే బోర్డుతో ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో బస్సు

ఇబ్రహీంపట్నం: 'పురుషులకు మాత్రమే'.. అన్న బోర్డుతో ఇబ్రహీంపట్నం డిపోలో ఓ బస్సు ప్రత్యక్షమైంది. ఎల్‌బీనగర్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ఈ బస్సును ఉదయం వేళల్లో నడిపారు. రెండు రోజులుగా ఉదయం 9 గంటల సమయంలో ఒక ట్రిప్పు నడిపినట్లు తెలుస్తోంది. మామూలుగా లేడీస్ స్పెషల్ బస్సులు చూస్తుంటాం. కానీ ఇదేమిటి పురుషులకు మాత్రమే.. అంటూ అందరూ విస్మయంగా చూశారు. ఇది కాస్తా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. గురువారం స్థానికంగా అందరినోటా ఇదే చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిన సంగతి తెలిసిందే. దీంతో మహిళల రద్దీ పెరిగి బస్సుల్లో ప్రయాణించలేకపోతున్నామని పురుషులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పురుషులకు మాత్రమే బోర్డు పెట్టి బస్సును వేయడంతో ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో వార్తల్లోకి ఎక్కింది.

స్థిరాస్తికి నిరాశే!

రియల్ రంగానికి దక్కని పరిశ్రమ హోదా

- అఫర్డబుల్ హౌసింగ్‌కు ఊరట కరువు
- టీఓడీ ప్రాజెక్టులతో నగరంలో స్థిరమైన అభివృద్ధి
- గృహాలకు డిమాండ్.. ధరల పెరుగుదల



సాక్షి, సిటీబ్యూరో: ఊహించినట్లుగానే మరోసారి స్థిరాస్తి రంగానికి రిక్తహస్తమే ఎదురైంది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి పరిశ్రమ హోదా ఈసారి మధ్యంతర బడ్జెట్‌లోనూ దక్కలేదు. సులభతర రుణాలు, పన్ను మినహాయింపులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి ప్రయోజనాలను చేకూర్చే ఈ పరిశ్రమ హోదా ఊసెత్తకుండానే కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగం ముగించారు. సెక్షన్ 24 ప్రకారం గృహ రుణాలపై వడ్డీ తగ్గింపు పరిమితిని పెంచాలనే గృహ కొనుగోలుదారుల ఆశలూ అడియాసలయ్యాయి. పట్టణ ప్రాంతాలలో అఫర్డబుల్ హౌసింగ్‌లకు ఎలాంటి కేటాయింపులు చేపట్టకుండా చేతులు దులుపుకొన్నారు. దీంతో అర్బన్ ఏరియాలలో సామాన్యుల సొంతింటి కల మరింత క్లిష్టతరమవుతుందని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనూజ్ పూరి అభిప్రాయపడ్డారు.

మౌలిక వసతులకు బూస్ట్..

దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల నవీకరణ, అనుసంధానం ప్రకటనలు మాత్రం నగర స్థిరాస్తి రంగానికి కాస్త ఊరట కల్పించే అంశమని చెప్పాలి. దీంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాలలోనే కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలలో కూడా స్థిరాస్తి రంగానికి ప్రయోజనాలు చేకూరతాయి. మధ్యతరగతిలోని అర్హులైన వర్గాలకు, అద్దె ఇళ్లు లేదా మురికివాడలు, లేదా అనధికార కాలనీల్లో నివసిస్తున్న వారికి సొంత ఇల్లు కొనడానికి లేదా కట్టుకోవడానికి ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభించనుంది. దీంతో సులభంగా మురికివాడల ఆక్రమణ ప్రాంతాలకు విముక్తి కలిగించి, పునరాభివృద్ధికి అవకాశం ఉంటుందని నిపుణులు ధీమా వ్యక్తం చేశారు.

టీఓడీతో మెరుగైన ప్రజా రవాణా..

ఈసారి మధ్యంతర బడ్జెట్‌లో విత్తమంత్రి పట్టణ ప్రాంతాల్లో రవాణా ఆధారిత అభివృద్ధి (ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్–టీఓడీ)లకు ప్రాముఖ్యత ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో నగరాల్లో ప్రజా రవాణా వ్యవస్థ మెరుగవుతుంది. టీఓడీ ప్రాజెక్ట్‌లతో నడిచే వెళ్లే దూరంలో నివాస, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, వినోద కేంద్రాలుంటాయి. ఈ తరహా ప్రాజెక్టులతో ప్రైవేట్ కార్ల వినియోగం తగ్గి, ప్రజా రవాణా వ్యవస్థ వినియోగం పెరుగుతుంది. అంతిమంగా స్థిరమైన పట్టణాభివృద్ధి జరుగుతుంది. టీఓడీ ప్రాజెక్ట్ చుట్టూ అధిక సాంద్రత ఉన్న మిశ్రమ వినియోగ ప్రాంతాలుంటాయి. ఈ కేంద్రం నుంచి తక్కువ సాంద్రత ఉన్న ప్రాంతాలు విస్తరించి ఉంటాయి. దీంతో గృహాలకు డిమాండ్ ఏర్పడుతుంది. నగర శివారు ప్రాంతాలు, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలలో నివాస ధరలూ పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

పర్యాటకాభివృద్ధి..

ఐకానిక్ టూరిస్ట్ సెంటర్ల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. దీంతో కరోనాతో పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిన హోటళ్లు, రెస్టారెంట్లు వంటి ఆతిథ్య రంగంలో నూతనోత్తేజం నిండుకుంది. పర్యాటక రంగం కోసం దీర్ఘకాలిక రుణాలను బడ్జెట్‌లో ప్రతిపాదించడం హర్షించదగ్గ పరిణామం. క్యాపెక్స్ అవుట్‌లే కేటాయింపుల పెంపుతో స్థిరాస్తి రంగంలో అభివృద్ధి అవకాశాలు మరింత మెరుగవుతాయి. ఎందుకంటే ఈ కేటాయింపుల్లో ఎక్కువ భాగం మౌలిక వసతుల నవీకరణ కోసం, కొత్త ప్రాజెక్టులకు కేటాయిస్తుంటారు. స్టార్టప్‌లకు పన్ను ప్రయోజనాన్ని మరో ఏడాది పాటు పొడిగించడంతో ఆఫీసు స్పేస్ రియల్ ఎస్టేట్ రంగం పునరుజ్జీవనం చెందుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

లైన్లు వేశాం.. రైళ్లే లేవు

- రెండో దశ రైల్వే లైన్ల నిర్మాణం పూర్తి
- రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తే ఎంఎంటీఎస్ రైళ్లు
- ద.మ. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: ఎంఎంటీఎస్ రెండో దశ లైన్ల నిర్మాణం దాదాపు పూర్తయిందని, నిధుల కొరతతోనే రైళ్లను నడపలేకపోతున్నామని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. గురువారం రైల్‌నిలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎంఎంటీఎస్ రెండో దశ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.375 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. నగరంలోని ఆరు మార్గాల్లో ఎంఎంటీఎస్ రెండో దశ నిర్మాణం చేపట్టగా ఇప్పటి వరకు రైల్వే నిధులతోనే చాలా వరకు పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టిన ఎంఎంటీఎస్‌కు ఈ పదేళ్లలో నిధుల కొరత అతి పెద్ద సవాల్‌గా మారిందన్నారు. గత బడ్జెట్‌లో కేంద్రం సుమారు రూ.600 కోట్ల వరకు నిధులను కేటాయించింది. దీంతో మేడ్చల్ నుంచి బొల్లారం మీదుగా ఫలక్‌నుమా వరకు, మేడ్చల్ నుంచి లింగంపల్లి వరకు, లింగంపల్లి నుంచి రామచంద్రాపురం వరకు రెండోదశ సేవలను విస్తరించారు. ఘట్‌కేసర్ వరకు పనులు పూర్తయ్యాయి. మౌలాలీ–సనత్‌నగర్ మధ్య తుది దశకు చేరుకున్నాయి. దాదాపు అన్ని మార్గాల్లో రెండో దశ నిర్మాణం పూర్తయినా రైళ్లను నడిపేందుకు నిధుల లేమి సవాల్‌గా మారిందని జీఎం తెలిపారు. 9 బోగీలు కలిగిన ఎంఎంటీఎస్ రైళ్ల కొనుగోలు కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సానుకూలం..

రైల్వే ప్రాజెక్టులపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు జీఎం వివరించారు. యాదాద్రి వరకు రెండో దశ పొడిగింపుపైనా ప్రభుత్వం సానుకూలతను వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. యాదాద్రి విస్తరణతో పాటు, రెండోదశకు ఇవ్వాల్సిన నిధులను కూడా ప్రభుత్వం విడుదల చేస్తే అన్ని రూట్లలో అతి తక్కువ చార్జీలతో ప్రజలకు రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రస్తుతం ప్రతిరోజు సుమారు 47 వేల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. మేడ్చల్–ఉందానగర్, మేడ్చల్–లింగంపల్లి రూట్‌లలో మాత్రం రోజుకు 1000 మంది లోపే ప్రయాణం చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ క్రమంలో ప్రయాణికుల ఆక్యుపెన్సీ పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు జీఎం వివరించారు. కచ్చితమైన సమయపాలన పాటించడంతో పాటు, ట్రిప్పులు పెంచామన్నారు. మెట్రో, ఇతర ప్రయాణ సదుపాయాలతో ఎంఎంటీఎస్‌లో ఆక్యుపెన్సీ తగ్గిందని చెప్పారు. మరోవైపు ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల చాలా మంది మహిళలు ఎంఎంటీఎస్ నుంచి సిటీ బస్సుల్లోకి మారినట్లు పేర్కొన్నారు.

పింక్ బుక్ వస్తేనే వివరాలు..

గతంతో పోల్చితే ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారని. కానీ కొత్తగా అందుబాటులోకి రానున్న ప్రాజెక్టులు, లైన్‌లు, రైళ్లు, తదితర అంశాలపై పింక్ బుక్ విడుదలైతే తప్ప స్పష్టత ఉండదన్నారు.

నిధులు అరకొర

బడ్జెట్లో నగరంలోని ప్రాజెక్టులకు కేంద్రం అరకొర నిధులను కేటాయించింది. చర్లపల్లి టర్మినల్ కోసం రూ.45 కోట్లు, ఎంఎంటీఎస్ రెండో దశ కోసం రూ.10 కోట్లు కేటాయించగా యాదాద్రి వరకు ప్రతిపాదించిన ఎంఎంటీఎస్ రెండో దశ విస్తరణ కోసం మరో రూ.50 కోట్లు ఈ బడ్జెట్లో కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కాగా సికింద్రాబాద్ స్టేషన్ పునరభివృద్ధి కోసం ఎలాంటి కేటాయింపులు లేకపోవడం గమనార్హం.

విద్యార్థిని కాళ్లపై నుంచి దూసుకెళ్లిన లారీ

- యంనంపేట్‌లో రోడ్డు ప్రమాదం
- బాధితురాలి పరిస్థితి విషమం



రోడ్డు ప్రమాదంలో గాయపడిన హర్షిత

పోచారం: విద్యార్థిని కాళ్లపై నుంచి లారీ దూసుకెళ్లిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో రాంపల్లికి చెందిన పతంగి హర్షిత (20) బీటెక్ (ఈసీఈ) ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురువారం కళాశాలలో పరీక్ష రాసిన అనంతరం స్కూటీపై ఇంటికి వెళ్తోంది. యంనంపేట్ చౌరస్తా దాటాక రాంపల్లివైపు వెళ్తున్న లారీని ఎడమ వైపు నుంచి ఓవర్ టేక్ చేయడంతో విద్యార్థిని కాళ్లపై నుంచి లారీ దూసుకెళ్లింది. దీంతో హర్షితకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోరు మోటార్ల కేబుల్ చోరీ

మొయినాబాద్: వ్యవసాయ బావుల వదనుఉన్న బోరుమోటర్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని అప్పారెడ్డి గూడలో చోటుచేసుకుంది. బాధిత రైతులు తెలిపిన ప్రకారం.. అప్పారెడ్డిగూడ శివారుల్లో ఉన్న సుమారు 10 వ్యవసాయ బోరుమోటర్ల కేబుల్ వైర్లను బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం మోటర్లు ఆన్ చేయడానికి వెళ్లిన రైతులకు కేబుల్ వైర్లు కనిపించలేదు. రాత్రి సమయంలో దొంగలు చోరీ చేసినట్లు భావించి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత ఆరు నెలలుగా మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్ల చోరీ తరచూ జరుగుతుంది. కేబుల్ వైర్లలో ఉండే రాగి తీగలకోసం దుండగులు చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రైతులు ఎన్నోసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఒక్క దొంగను పట్టుకోలేదు.

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక..

వ్యక్తి బలవన్మరణం

షాద్‌నగర్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో ని ఎలికట్టలో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జంగం శ్రీశైలం(38) వ్యవసా యం చేస్తూ జీవనం సాగిస్తున్నా డు. ఇటీవల ఆయన రెండు కాడెద్దు మృత్యువాత పడ్డాయి. కాడెద్దులు చనిపోవడం.. అప్పుల బాధ తీరక పోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ దొరకలే దు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ ఘటనా స్థలికి చేరకుని పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య ఇద్దరు కొడుకులు, ఒక కూతురు సంతానం. మృతుని భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇళ్ల కూల్చివేత

'కొన్నేళ్లుగా నివాసముంటున్నాం.. కష్టం చేసుకుని బతుకుతున్నాం.. ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నాం.. మా ఇళ్లను తొలగించడం దారుణం.. కొంచెం కనికరించండయ్యా' అంటూ కార్పొరేషన్ పరిధిలోని పదవ డివిజన్ కుర్మల్‌గూడకు చెందిన పలువురు బాధితులు రెవెన్యూ అధికారులను వేడుకున్నారు. గురువారం తెల్లవారుజామున ఆక్రమణల పేరిట జేసీబీల సాయంతో ఇళ్లను నేలమట్టం చేశారు.


బడంగ్‌పేట్: అధికారులు కూల్చివేసిన ఇళ్లు

- బాధితుల ఆత్మహత్యా యత్నం
- అడ్డుకున్న పోలీసులు

బడంగ్‌పేట్: ప్రభుత్వ భూమిలో ఇళ్లను నిర్మించారనే ఫిర్యాదుతో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ కుర్మల్‌గూడలో 20 ఇళ్లను బాలాపూర్ రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. బాధితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా పోలీసులు వారిని నిలువరించారు. మా గూడును కూల్చితే ఎక్కడ తలదాచుకోవాలని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చేయడం సరికాదని వాపోతున్నారు.

తెలిసే రిజిష్టర్ ఎలా చేశారు?

ప్రభుత్వ భూమి అని తెలిసి ఎలా రిజిస్ట్రేషన్ చేశారని బాధితులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాతే ఇళ్లను నిర్మించుకున్నామని, ఇంటి నంబర్‌లను సైతం కేటాయించారని తెలిపారు. నాటి నుంచి క్రమం తప్పకుండా ప్రభుత్వానికి విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు చెల్లిస్తున్నామని వివరించారు. మున్సిపల్ అధికారులు విద్యుత్ మీటర్లు ఇచ్చిన అధికారులు ఇంటి నంబర్, టాక్స్‌లు వసూలు చేస్తూ లీగల్‌గా రిజిస్ట్రేషన్ సైతం చేశారు. ఇప్పుడు ఎలా కూల్చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ మమ్ములను మభ్యపెట్టి రూ.లక్షల్లో దండుకున్నారని ఆరోపిస్తున్నారు. తమకు అనుమతులిచ్చిన అధికారులపై, కార్పొరేటర్‌పై సైతం చర్యలు తీసుకోవలంటూ బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

వక్ఫ్ భూమిలో..

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని వక్ఫ్ భూమిలో అక్రమంగా నిర్మించిన ఓ ఇంటిని గురువారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్1/1లో ఉన్న వక్ఫ్ భూమిలో ఆమనగల్లుకు చెందిన బికుమాండ్ల బుచ్చయ్య ఇంటి నిర్మాణం చేపట్టాడని వక్ఫ్ బోర్డు సీఈఓ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారు.


ఆమనగల్లు: అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

చేవెళ్ల: మండల పరిధిలోని చనువెళ్లి గ్రామంలో పొలాల వద్ద గురువారం సాయంత్రం కొంతమంది పేకాట ఆడుతున్నారు. పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి ఏడు సెల్‌ఫోన్లు రూ.5,642 నగదును సీజ్ చేశారు. పేకాట ఆడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి హెచ్చరించారు

రౌడీషీటర్‌కు ఐదేళ్లు జైలు


సద్దాం


మహేశ్వరం: హత్యాయత్నం కేసులో ఓ రౌడీ షీటర్‌కు ఐదేళ్లు జైలు శిక్ష విధిస్తూ ఎల్‌బీ నగర్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో ఓ ఆటో డ్రైవర్‌ను ఠాణా పరిధిలోని రౌడీషీటర్ మిర్జా జాఫర్ బేగ్ సద్దాం అలియాస్ సద్దాం(25) చిన్న వివాదంలో ఓ యువకుడిపై కత్తితో దాడి చేశాడు. హత్యాయత్నం కింద కేసు నమోదు చేసిన బాలాపూర్ పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన ఎల్‌బీనగర్ న్యాయస్థానం న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటుగా రరూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


గోపాల్ (ఫైల్)

చేవెళ్ల: బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామన్నగూడ సమీపంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన కావలి గోపాల్(52) వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం పనిమీద తన బైక్‌పై చేవెళ్లకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో రామన్నగూడ మీదుగా వెళ్తుండగా రోడ్డుపై బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తంగడపల్లి గ్రామస్తుడిగా గుర్తించడంతో పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు సంతానం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువతి అదృశ్యం


రాజేశ్వరి(ఫైల్)

మహేశ్వరం: యువతి అదృశ్యమైన సంఘటన మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.గురువారెడ్డి తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన వడ్ల సంజు కుమార్తె రాజేశ్వరి (19) ఇంటి వద్దే ఉంటుంది. జనవరి 31న సంజు దంపతులు ఉదయం పనికి వెళ్లిన తర్వాత మధ్యాహ్నం రాజేశ్వరి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కాసేపటికి విషయం తెలుసుకున్న తల్లి నాగమణి ఆమె ఆచూకీ కోసం ఎక్కడ వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

దేవాదాయశాఖలోకి వీరభద్రస్వామి దేవాలయం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నారు. గురువారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పోలీసు బందోబస్తుతో దేవాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాన్ని ఆలయ పూజారులకు వివరించారు. దీంతో వారు సైతం ఎలాంటి అసమ్మతి లేకుండా అంగీకరించారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా ఆయన అనర్హుడు


మంచాల పీఏసీఎస్ కార్యాలయం


పుల్లారెడ్డిని అనర్హుడిగా ప్రకటిస్తూ పెట్టిన నోటీస్

మంచాల కార్యాలయానికి అధికారుల నోటీసులు

మంచాల: మంచాల పీఏసీఎస్ చైర్మన్ బుస్సు పుల్లారెడ్డిని అనర్హుడిగా ప్రకటిస్తూ గురువారం మంచాల పీఏసీఎస్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్టర్ విజయ నోటీసులు ఇచ్చారు. వివరాల ప్రకారం.. మంచాల పీఏసీఎస్‌లో 2021–22లో స్టేషనరీ, వాహన చార్జీలు, కొత్త భవన నిర్మాణ పనుల పేరుతో రూ.7,20,233 విడుదల చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు విడుదల చేశారంటూ పాలకవర్గ సభ్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పీఏసీఎస్ సమావేశాల్లోనూ పలుమార్లు సమస్యను లేవనెత్తారు. ఈ విషయంపై 2024 జనవరి 29లోపు వివరణ ఇవ్వాలని డీసీఓ ధాత్రిదేవి 2024 జనవరి 16న ఉత్తర్వులిచ్చారు. చైర్మన్ పుల్లారెడ్డి వివరణ ఇవ్వకపోవడంతో గురువారం అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ నేరుగా మంచాల పీఏసీఎస్ కార్యాలయానికి వచ్చి ఆయన్ను అనర్హుడిగా ప్రకటిస్తూ నోటీసులు ఇచ్చారు. నోటీసు బోర్డులోనూ నకలు కాపీ ఉంచారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కోటమైసమ్మ ఆలయంలో విగ్రహప్రతిష్ఠాప ఉత్సవాలకు హాజరయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లలితాజ్యోతయ్య, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మలగౌడ్, సర్పంచ్ గోపాల్‌నాయక్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శేఖర్, దశరథం, గురువయ్య, శ్రీశైలంగౌడ్, జగయ్య, అంజయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హస్తం గూటికి ఆరుగురు సొసైటీ డైరెక్టర్లు


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సొసైటీ డైరెక్టర్లు

ఇబ్రహీంపట్నం: వివిధ పార్టీల నుంచి నేతలు, నాయకులు ఒక్కరొక్కరుగా హస్తం గూటికి చేరుతున్నారు. తాజా గురువారం ఉప్పరిగూడ సొసైటీకి చెందిన ఆరుగురు డైరెక్టర్లు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కండువా కప్పుకొన్నారు. టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కంబాలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, గుర్రం సుధాకర్‌రెడ్డి, సుబ్బురు జంగయ్య, మేడిపల్లి వుల్లయ్య, బొమ్మకంటి అశోక్, వర్త సీతయ్యలు కాంగ్రెస్‌లో చేరినట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండు రంగారెడ్డి తెలిపారు.

పెళ్లి నిశ్చితార్థానికి వెళ్తూ.. తండ్రీకొడుకుల దుర్మరణం

- 11 మందికి తీవ్ర గాయాలు
- టైర్ పేలి టాటాఏస్ వాహనం పల్టీ
- సిద్దిపేట జిల్లాలో విషాద ఘటన
- మృతులు, క్షతగాత్రులంతా నగరవాసులే..

చిన్నకోడూరు(సిద్దిపేట): పెళ్లి నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తండ్రి, కొడుకు దుర్మణం చెందగా, 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బాలాజీనగర్‌కు చెందిన మరియాల శ్రీనివాస్(60), అతని కుమారుడు హన్మంత్‌రావు (26), కుటుంబ సభ్యులతో కలిసి కుమార్తె నిశ్చితార్థానికి టాటా ఏస్ ఆటోలో కరీంనగర్ బయలుదేరారు. ఈ క్రమంలో మండల పరిధిలోని రామునిపట్ల శివారులో వారు ప్రయాణిస్తున్న వాహనం టైర్ ఒక్కసారిగా పేలిపోయి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. శ్రీనివాస్, హన్మంత్‌రావులకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాస్ భార్య విజయ, పెద్దకుమారుడు రమేశ్, కోడలు జ్యోతి, వారి పిల్లలు జయ్, రిషికేష్‌లు, డ్రైవర్ వీరభద్రం, భార్య పావని, కుమారుడు బాబు, బంధువులు కందుకూరి లక్ష్మయ్య, సరిత, సాయికిరణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సుభాష్ గౌడ్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి కొడుకుల మృతదేహాలను మార్చురీకి తరలించారు. మృతుని భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్ గౌడ్ తెలిపారు.